పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

విద్యారంగ సమస్యలపై కలెక్టరేట్ ముట్టడి

- కలెక్టరేట్ ముట్టడి ఉద్రిక్తత
- డిఆర్ఒకు వినతి పత్రం అందజేసిన ఎస్ఎఫ్ఐ నాయకులు
- ట్వీట్ చేసిన నిధుల విడుదల ఎక్కడ
- కెవిఆర్ జూనియర్ కళాశాల హాస్టల్ సౌకర్యం కల్పించాలి
- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్నకుమార్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌ను ముట్టడించారు. మంగళవారం ముట్టడి కార్యక్రమంలో భాగంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్నకుమార్, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రంగప్ప, అబ్దుల్లా, నగర అధ్యక్ష కార్యదర్శులు అమర్, సాయి వెంటనే విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కలెక్టరేట్ గేట్లను తెరుచుకొని లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించగా వెంటనే వారిని పోలీసులు నిలువరించారు. కొంతసేపు పోలీసులకు ఎస్ఎఫ్ఐ నాయకులు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. విద్యార్థులు కలెక్టరేట్‌లోకి దూసుకెళుతుండగా పోలీసులు అడ్డుకున్నారు. ఈలోపు డిఆర్ఒకు పోలీసులు సమాచారం ఇవ్వడంతో అక్కడికివచ్చి ఎస్ఎఫ్ఐ నాయకులు నుంచి వినతిపత్రాన్ని తీసుకున్నారు. కర్నూలులోని కెవిఆర్ జూనియర్ కళాశాలకు హాస్టల్ సౌకర్యం కల్పించాలని, పెండింగులో ఉన్న విద్యా దీవెన, వసతి దీవెన బకాయిలు విడుదల చేయాలని, విద్యారంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని డిఆర్ఒకు నాయకులు వివరించారు. సమస్యలన్నింటినీ కలెక్టర్‌కు, ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు. ప్రసన్న కుమార్, రంగప్ప, అబ్దుల్లా మాట్లాడుతూ విద్యార్థులకు సంబంధించిన ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిల విడుదలకు సంబంధించి మంత్రి నారా లోకేష్ టీట్ చేశారని, నిధులు ఎక్కడ విడుదల చేశారని ప్రశ్నించారు. వెంటనే నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మాట్లాడారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యారంగంలో ఉన్న సమస్యలు పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని యువగళం పాదయాత్రలో నారా లోకేష్ హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చి ఐదు నెలలు అవుతున్న పెండింగులో ఉన్నయన్నారు. రూ. 3, 480కొట్ల విద్యాదీవెన, వసతి దీవెన బకాయిలు విడుదల చేయలేదని, దాంతో విద్యార్థులు విద్యార్థుల తల్లిదండ్రులు అప్పు తెచ్చి కట్టాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తామని హామీ ఇచ్చారని, ఇంతవరకు అమలు చేయలేదని ఇప్పటికైనా వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలు కేటాయించాలన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు 3 వేలకు పెంచాలన్నారు. తుగ్గలి దేవనకొండ మండల కేంద్రాల్లో ఎపి మోడల్ స్కూల్స్ ఏర్పాటు చేయాలని తల్లికి వందనం కింద ఇస్తానన్న రూ.15వేలు వెంటనే విడుదల చేయాలన్నారు. డిగ్రీలో మేజర్ మైనర్ విధానాన్ని రద్దు చేయాలని, ఉన్నత విద్యను దూరం చేసే జీవో నెంబర్ 77 రద్దుచేసి పీజీ చదివిన విద్యార్థులందరికీ ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తింపచేయాలని వారు డిమాండ్ చేశారు.జిల్లా ఉపాధ్యక్షులు శీను, రవి, సహాయ కార్యదర్శులు విజయ్, జిల్లా నాయకులు అమర్, మల్లేష్, అబ్బుగౌస్, అంజి, నాయకులు మనోహర్, తరుణ్, శంకర్, భాస్కర్, యోగి, ఆర్యన్ పాల్గొన్నారు.

కలెక్టరేట్ ముట్టడి చేపట్టిన నాయకులు

మాట్లాడుతున్న నాయకులు

మూడు నెలల్లోపు పనులన్నీ పూర్తి

- ఓర్వకల్ పారిశ్రామిక వాడ పనులను పరిశీలించిన కలెక్టర్

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

ఓర్వకల్లు పారిశ్రామిక వాడకు నీటిని సరఫరా చేసే పైప్‌లైన్ పనుల తోపాటు ఇంటర్నల్ రోడ్స్ ఇతర పనులను మూడు నెలల్లోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాష అధికారులను ఆదేశించారు. మంగళవారం ఓర్వకల్ పారిశ్రామిక వాడలో భాగంగా గుట్టపాడులోని జయరాజు స్టీల్ ప్లాంట్ నిర్మాణం పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో పరిశ్రమల శాఖ ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ ముచ్చుమర్రి నుంచి ఓర్వకల్లు పారిశ్రామిక వాడకు నీటిని సరఫరా చేసేందుకు ఏర్పాటు చేస్తున్న పైప్‌లైన్ పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనులు 50 శాతం పూర్తయ్యాయని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. త్వరగా ఈ పనులన్నీటిని పూర్తి చేయాలని ఆదేశించారు.

తహశీల్దార్ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీ

తహశీల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.కుల ధ్రువీకరణ పత్రాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, కర్నూలు ఆర్‌డిఒ సందీప్ కుమార్, ఎపిసిసి జోనల్ మేనేజర్ శ్రీనివాసరెడ్డి, పరిశ్రమల శాఖ ఇన్చార్జ్ జిఎం అరుణ, ఓర్వకల్లు తహశీల్దార్ విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

నేనూ చనిపోతా...

- మద్యం మత్తులో వ్యక్తి హంగామా.. - పరుగులు తీసిన పోలీసులు..!

ప్రజాశక్తి - కౌతాళం

కన్న కూతురు చనిపోయిన బాధ జీర్ణించుకోలేక.. 'నా కూతురు చనిపోయింది. నేను కూడా చనిపోతాన'ని ఓ వ్యక్తి స్థానిక ఒహెచ్ఆర్ వాటర్ ట్యాంకు ఎక్కి హంగామా సృష్టించాడు. విషయం తెలుసుకున్న పోలీసులు పరుగులు తీసిన సంఘటన మంగళవారం కౌతాళంలో చోటు చేసుకుంది. గ్రామస్తుల వివరాల మేరకు... గ్రామానికి చెందిన దావీదు, జ్యోతి దంపతులకు నలుగురు సంతానం. జీవనోపాధి కోసం ప్రతేడాది తెలంగాణకు వలస వెళ్లి కౌతాళం తిరిగి వచ్చేవారు. పది రోజుల క్రితం 14 ఏళ్ల కూతురు అకస్మాత్తుగా మృతి చెందింది. ఈ బాధతో ఆ తండ్రి కూతురి ఫొటోతో వాటర్ ట్యాంకు ఎక్కి 'నేను కూడా ఆత్మహత్య చేసుకుంటాన'ని హల్‌చల్ చేశాడు. విషయం తెలుసుకున్న చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకున్నారు. గ్రామస్తుల సహకారంతో ఆ వ్యక్తిని కిందికి తీసుకురావడానికి పోలీసులు నానా తంటాలు పడ్డారు. ఎట్టకేలకు ఆ వ్యక్తి కిందికి దిగి రావడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

వాటర్ ట్యాంకు ఎక్కిన వ్యక్తి

కీలక శాఖలకు అధికారులు ఎక్కడ

- ఇన్‌ఛార్జులతోనే కొనసాగింపు
- గాడి తప్పుతున్న పరిపాలన

ప్రజాశక్తి -కర్నూలు కలెక్టరేట్

పరిపాలన ద్వారా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకుగాను ప్రభుత్వ శాఖల పర్యవేక్షణకు అధికారులు ఎంతో అవసరం. జిల్లాలో అనేక శాఖలకు పూర్తిస్థాయి అధికారులు లేకపోవడంతో పరిపాలన గాడి తప్పింది . అనేక కీలక శాఖల ద్వారా చేపట్టాల్సిన కార్యక్రమాలు పర్యవేక్షణ ముందుకు సాగడం లేదు. ఇన్చార్జి అధికారులతోనే ఆయా శాఖలకు కేటాయించి ముందుకు సాగిస్తున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెనువెంటనే అధికారుల ఉద్యోగుల బదిలీలకు చర్యలు చేపట్టింది. అక్టోబర్ మాసం మొదటి వారం వరకు ఉద్యోగుల బదిలీల ప్రక్రియను నిర్వహించింది. సాధారణ బదిలీల్లో భాగంగా అనేక శాఖలకు కొత్త అధికారులు వేరే జిల్లాల నుండి ఇచ్చేశారు. కొన్ని శాఖలకు అధికారుల నియామకం జరిగినా విధుల్లోకి చేరలేదు. జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్‌గా పనిచేస్తున్న అమర్నాథ్ రెడ్డి మదనపల్లి డిఎల్‌డిఓ గా బదిలీ అయ్యారు. ఇక్కడికి బాపట్ల జిల్లా నుండి శివప్రసాద్‌ను బదిలీ చేశారు. ఇప్పటివరకు సదరు అధికారి ఇక్కడికి వచ్చేందుకు మొగ్గు చూపలేదు. ఇప్పుడు ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా జిల్లా పరిషత్ సిఇఒ నాసర రెడ్డి అదనపు విధులను నిర్వహిస్తున్నారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్‌గా పనిచేస్తున్న సలీంబాషను అనంతపురం జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్‌గా బదిలీ చేశారు. డిఆర్‌డిఎ పిడి స్థానంలోకి గతంలో ఆర్థిక మంత్రి బుగ్గన ఒఎస్‌డిగా పని చేసిన ప్రతాపరెడ్డిని నియమించారు. ప్రతాపరెడ్డి నియామకం పట్ల అధికార పార్టీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేయడంతో ఆయన విధుల్లోకి చేరకుండానే వెళ్లిపోయారు. మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ నాగశివలీల డిఆర్‌డిఎ పిడిగా అదనపు బాధ్యతలను నిర్వహిస్తున్నారు. జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ గత ఏడాదికి పైగా ఖాళీగా ఉండడంతోనే జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారి వెంకటలక్ష్మి అదనపు బాధ్యతలను నిర్వహిస్తున్నారు. గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా ఇక్కడ పనిచేస్తున్న సిద్ధాలింగమూర్తిని బాపట్ల జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా బదిలీ చేశారు. మొన్నటి వరకు జిల్లా ఇన్చార్జి రెవెన్యూ అధికారిగా పనిచేసిన స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చిరంజీవికి ప్రాజెక్ట్ డైరెక్టర్గా అదనపు బాధ్యతలు పర్యవేక్షిస్తున్నారు. సమగ్ర శిక్ష అభియాన్ అడిషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ పోస్ట్ కూడా గత కొన్ని నెలలుగా ఖాళీగానే ఉంది. ఈ పోస్టుకు జిల్లా విద్యాశాఖ అధికారి అదనపు బాధ్యతలను నిర్వహిస్తున్నారు. జిల్లాలో అనేక కీలక శాఖలో పోస్టులన్నీ అదనపు బాధ్యతలతో పర్యవేక్షణ చేయించడం పట్ల పరిపాలన ముందుకు సాగడం లేదు. ఈ శాఖల ద్వారా ప్రజలకు అందాల్సిన సేవలు కూడా సక్రమంగా అందడం లేదు. జిల్లా లోనే కీలక శాఖలన్నీ భర్తీ కాకుండా ఉండడంతో ఆయా శాఖలకు సంబంధించిన లక్ష్యాలను చేరుకోవడం కష్టతరంగా మారుతుంది. ఇప్పటికైనారాష్ట్ర ప్రభుత్వంవెంటనే సంబంధిత శాఖలకు రెగ్యులర్ అధికారులను నియమించాలని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఆయాల సమస్యల పరిష్కారానికి కృషి

డిఇఒకు అభినందనలు తెలుపుతున్న పాఠశాల ఆయాలు యూనియన్ నేతలు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.శామ్యూల్‌పాల్ వెల్లడించారు. మంగళవారం శానిటేషన్ వర్కర్స్ యూనియన్ సిఐటియు ఆయాల ప్రతినిధి బృందం కలిసి డిఇఒ శ్యామ్యూల్ పాల్‌కు అభినందనలు తెలిపారు. యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు జె.నాగేశ్వరరావు ఆయాల యూనియన్ జిల్లా కార్యదర్శి ఆసియా పటాన్, మద్దమ్మ, లక్ష్మి, సుజాత, రమణమ్మ, సువర్ణ, ఉరుకుందమ్మా, సరోజమ్మ, సువార్తమ్మ, పద్మావతి,జయంతి తదితరులు పాల్గొన్నారు.

నేడు కప్పట్రాళ్లలో వామపక్ష పార్టీల పర్యటన

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

దేవనకొండ మండలం కప్పట్రాళ్ల రిజర్వ్ ఫారెస్టులో జరుగుతున్న యురేనియం అన్వేషణ ఆపాలని ప్రజాఆందోళన జరుగుతున్న నేపథ్యంలో వాపపక్షపార్టీల నాయకులు బుధవారం పర్యటించనున్నారు. సిపిఎం కేంద్రకమిటీ సభ్యులు ఎంఎ.గఫూర్, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సిపిఎం, సిపిఐ, సిపిఐఎంఎల్ జిల్లా కార్యదర్శులు తదితరులు పర్యటిస్తారు.

అక్రమ రిజిస్ట్రేషన్ ప్లాట్లను రద్దు చేయాలి

కలెక్టరేట్ ఎదుట ప్రజా పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ధర్నా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

నాలుగో తరగతి ఉద్యోగుల సొసైటీలో అక్రమంగా రిజిస్టర్ అయిన 59 ప్లాట్లను వెంటనే రద్దు చేయాలని ప్రజా పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు కె. బలరాం డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ ఎదుట నాలుగో తరగతి ఉద్యోగుల సొసైటీ బాధితులతో కలిసి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ వెంటనే జోక్యం చేసుకొని అక్రమ రిజిస్ట్రేషన్ చేసిన వ్యక్తులపై వెంటనే క్రిమినల్ కేసులను నమోదు చేవ్యాలని డిమాండ్ చేశారు.

పంటల బీమా చేసుకోవాలి : ఎఒ

ప్రజాశక్తి- మద్దికేర : రబీలో రైతులు వేసిన పంటలకు సకాలంలో పంటల బీమా చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి రవికుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఈ సంవత్సరం ప్రభుత్వం కింద కనపరిచిన వంటలకు మాత్రమే ఇన్సూరెన్స్ చెల్లిస్తామని ప్రభుత్వం ఆమోదించిన తేదీల్లో ఇన్సూరెన్స్ చెల్లించాలని అన్నారు. పప్పు శనగ రూ.420 ,మొక్కజొన్న రూ.297 , వేరుశనగ రూ.480 ,ఉల్లి రూ.1350, టమోటా రూ.1500 డిసెంబర్ 15లోపు చెల్లించాలన్నారు. వరి రూ.630, డిసెంబర్ 31 లోగా చేయించుకోవాలని రైతులకు సూచించారు.

సమస్యల పరిష్కారానికి ప్రజా పోరుయాత్ర

-8 నుంచి 14 వరకు కలిసి రావాలి

-సిపిఎం జిల్లా కమిటీ ప్రజలకు పిలుపు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన టిడిపి కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యలను విస్మరించి ప్రజలపై భారాలేస్తూ పాలన చేస్తుందని ఈ భారాలకు వ్యతిరేకంగా ప్రజా సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ ప్రజా పోరు పేరుతో ఈ నెల 8 నుండి 14 వరకు ఉద్యమాన్ని చేపట్టిందని, ఈ ఉద్యమంలో ప్రజలు భాగస్వామ్యం కావాలని సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్ పిలుపునిచ్చారు. మంగళవారం కర్నూలు సుందరయ్య భవన్లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో సిపిఎం నగర కార్యదర్శులు టి. రాముడు, ఎం.రాజశేఖర్‌లతో కలిసి ఆయన మాట్లాడారు. కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం, రాష్ట్రంలోని టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి ప్రజలపై భారాలు వేయడమే పనిగా పెట్టుకున్నయని ఘాటుగా విమర్శించారు. నిత్యవసర వస్తువుల ధరలు అడ్డు అదుపు లేకుండా పెరుగుతున్నా వాటిని అరికట్టడంలో ఘోరంగా వైఫల్యం చెందాయని తెలిపారు. నిత్యవసర వస్తువుల ధరలు 40 శాతం నుండి 100శాతం పెరిగాయని అన్నారు. ఈ ధరల పెరుగుదల వల్ల దసరా, దీపావళి పండుగలు చేసుకోని కుటుంబాలు చాలా ఉన్నాయని తెలిపారు. ప్రజల పైన ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా ఈ ప్రభుత్వాలు కేరళ ప్రభుత్వం లాగా 14 రకాల నిత్యవసర వస్తువులు చౌక డిపోల ద్వారా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్టు ఇప్పటికే ధరలతో బాధపడుతున్న ప్రజలపై టిడిపి కూటమి ప్రభుత్వం విద్యుత్ ట్రూఆఫ్ చార్జీల పేరుతో రూ. 20 వేల కోట్ల భారాలు వేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో విద్యుత్ ఛార్జీలు పెరిగినప్పుడు బాదుడే బాదుడు అనే పేరుతో గగ్గోలు పెట్టిన టిడిపి కూటమి నాయకులు ఎందుకు ట్రూ ఆప్ చార్జీలు పెంచుతున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలని నిలదీశారు. ట్రూ ఆఫ్ చార్జీలను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హాయంలో ఉన్న మద్యం పాలసీని మార్చి కొత్త పాలసీ తెచ్చిన కూటమి నాయకులు ఈరోజు మద్యం ఏరులై పారుతుంటే గ్రామాల్లో కూడా బెల్ట్ షాపులు వెలుస్తుంటే ఎందుకు అరికట్ట లేకపోతున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలని ఆయన నిలదీశాడు. సూపర్ సిక్స్ పథకాల పేరు చెప్పి ప్రజలను మభ్యపెట్టి ఓట్లు దండుకున్న కూటమి నాయకులు ఇప్పటివరకు ఎందుకు వాటిని అమలు చేయటం లేదని ప్రజలకు తెలపాలని కోరారు. బడికి పోతున్న పిల్లలకు తల్లివందనం ఎక్కడని విద్యార్థులు ప్రశ్నిస్తున్నారని అన్నారు. నిరుద్యోగులకు డిఎస్సి, నిరుద్యోగ భృతి అందరి ద్రాక్షలా మారిందని ఆయన ఎద్దేవ చేశారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి నాలుగు నెలలు పూర్తికాకముందే వ్యతిరేకత మూట కట్టుకున్నదని , ఇది దాని ప్రత్యేకత అని విమర్శించారు. రైతులకు రూ.20వేల భరోసా కింద ఇస్తామన్న వాగ్దానం గాలి మాటలాగే నిలిచి పోయిందని ఇది రైతులకు మోసం చేయడం కాదా అని ప్రశ్నించారు. నాలుగు నెలల కాలంలోనే ప్రజలపై భారాలేస్తున్న ఈ ప్రభుత్వానికి వ్యతిరేకంగా సిపిఎం ప్రజా ఉద్యమాన్ని చేపట్టిందని ఈనెల 8నుంచి14వ వరకు ఈ ఉద్యమంలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని సంఘీభావం తెలపాలని కోరారు.

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్

కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుతున్న డిడి జయమ్మ, జర్నలిస్టు నాయకులు

ఎపిడబ్ల్యుజెఎఫ్ మరింత అభివృద్ధి చెందాలి

17వ ఆవిర్భావ దినోత్సవంలో సమాచార శాఖ డిడి జయమ్మ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (ఎపిడబ్ల్యుజెఎఫ్) 17వ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. సమాచార శాఖ కార్యాలయ ఆవరణంలో నిర్వహించిన కార్యక్రమానికి సమాచార శాఖ డిప్యూటీ డైరెక్టర్ జయమ్మ కేక్‌ను కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆమె మాట్లాడుతూ జర్నలిస్టుల పక్షాన నిలిచి నిరంతరం వారి హక్కుల కోసం పని చేస్తున్న ఎపిడబ్ల్యుజెఎఫ్ మరింత అభివృద్ధి చెందాలని అన్నారు. అనంతరం ప్రభుత్వ సర్వజనవైద్య శాలలో సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు చేతుల మీదుగా క్యాజువాల్టి, గైనకాలజీ విభాగాల్లో పండ్ల పంపిణీ చేశారు. సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జర్నలిస్టులు సేవ కార్యక్రమాలు నిర్వహించడం శుభపరిణామం అన్నారు. ఎపిడబ్ల్యుజెఎఫ్ ఇలాంటి వేడుకలు మరెన్నో నిర్వహించాలన్నారు. అనంతరం రాష్ట్ర కార్యదర్శి టి.మద్దిలేటి, నాగేంద్ర, ఫోటో గ్రాఫర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు డి.హుస్సేన్, నగర అధ్యక్షుడు శివకుమార్ సీనియర్ నాయకులు చిన్న రామాంజనేయులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం నవంబర్ 5న ఎపిడబ్ల్యుజెఎఫ్ వ్యవస్థాపక దినోత్సవం రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. అందులో భాగంగా కర్నూలు జిల్లా వ్యాప్తంగా వార్షికోత్సవం వేడుకలు నిర్వహించామన్నారు. నిరంతరం జర్నలిస్టుల పక్షాన నిలిచి అలుపెరగని పోరాటాలు నిర్వహిస్తున్నామన్నారు. రాబోవు రోజుల్లో జర్నలిస్టుల అభ్యున్నతికి మరింత బాసటగా నిలుస్తామన్నారు. సీనియర్ జర్నలిస్ట్ సత్యనారాయణ గుప్తా, సుజాత, నగర నాయకులు బ్రహ్మయ్య, వెంకటేష్, ఎర్రమల, ఫోటోగ్రాఫర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వడ్డే శ్రీనివాసులు, సుందర్ రాజు, నర్సిరెడ్డి, హనుమంతు పాల్గొన్నారు.

విపత్తులశాఖ విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి- సి బెళగల్

మండలంలోనీ సుంకేసుల డ్యాం వద్ద విపత్తుల బృందం మంగళవారం పర్యటించారు. కొత్తకోట హైస్కూల్ విద్యార్థులకు జిల్లా విపత్తుల పరిశీలక అధికారిణి అనుపమ ఎన్‌డిఆర్ఎఫ్ బృందం కెప్టెన్ గజేంద్ర యాదవ్, ఎక్సయిజ్ సూపర్ వైజర్ దామోదర్ సింగ్, డిప్యుటీ కమాండర్, ఓబులేసు లు 15 మంది సిబ్బందితో అవగాహన సదస్సు నిర్వహించారు. వరదలు వచ్చినప్పుడు, అగ్ని ప్రమాదాలు సంబవించినప్పుడు, ఏదైనా ఆనుకొని విపత్తులో నదుల వద్ద, డ్యాంల వద్ద వ్యక్తులుగాని, పడవలు గాని మునిగిన వ్యక్తులు కోమాలోకి వెళ్లినా శ్వాస, రక్తప్రసరణ, నాడి వ్యవస్థ ఎలా పనిచేస్తుందో అవగాహన అవసరమని పేర్కొన్నారు. రెవిన్యూ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఐసి కళాజాతాలో ప్రజలు కలిసి రావాలి : ఉద్యోగుల సంఘం పిలుపు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ప్రజాధనం ప్రజలకు వినియోగం కోసం అనే పేరుతో ఎల్ఐసి ఉద్యోగుల ఆధ్వర్యంలో జరుగు కళాజాతాను జయప్రదం చేయాలని ఎల్ఐసి ఉద్యోగుల సౌత్ సెంట్రల్ జోన్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సెక్రెటరీ జి.తిరుపతయ్య ఐసిఇయు కడప డివిజన్ సెక్రెటరీ రఘునాథ్ రెడ్డి, హైదరాబాద్ డివిజన్ ఐసిఇయు సెక్రటరీ మద్దిలేటి పిలుపు నిచ్చారు. ఎల్ఐసి ఎంప్లాయిస్ యూనియన్ సెక్రెటరీ సునియా కుమార్ అధ్యక్షతన కార్మిక కర్షక భవన్‌లో జాత జయప్రదానికి కార్మిక సంఘాలు , ప్రజా రంగాల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ బెంగళూరులో జరుగుతున్న సౌత్ సెంట్రల్ ఎల్ఐసి ఉద్యోగుల సంఘం మహాసభల సందర్భంగా ఈ కళాజాతాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కళా జాతాలోప్రభుత్వ రంగ ప్రాముఖ్యతను వివరిస్తూ ప్రజలను చైతన్యవంతం చేసే కార్యక్రమం జరుగు తుందని అన్నారు. ప్రభుత్వ బీమా ఆవశ్యకతను గురించి తెలియజేస్తామని అన్నారు. సమాజ శ్రేయస్సు కోసం పౌరుల హక్కులు బాధ్యతలు వివరిస్తామన్నారు. ప్రభుత్వం విధులు గురించి కూడా ప్రశ్నిస్తూ కళాజాతా నిర్వహించడం జరుగుతుందని అన్నారు. వివిధ కళారూపాలను ప్రదర్శిస్తూ ప్రజలను చైతన్యవంతం చేసే ఈ కళాజాతా ఈ నెల 13న 7 గంటలకు స్థానిక సి క్యాంప్ సెంటర్‌కు చేరుకుంటుందన్నారు. ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.అంజిబాబు, ఆవాజ్ రాష్ట్ర అధ్యక్షులు సుభాన్, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎండి ఆనంద్ బాబు, మహిళా సంఘం నగర నాయకులు కిరణ్మయి, సిఐటియు నగర కార్యదర్శులు సిహెచ్.సాయిబాబా, విజయ్, జిఐసి ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు రఘుబాబు, మెడికల్ రిప్స్ యూనియన్ నాయకులు వెంకట్, ఎపిజిబి ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు హనుమంత్ రెడ్డి, యుటిఎఫ్ జిల్లా నాయకులు జయ రాజు, జెవివి జిల్లా కార్యదర్శి సుధీర్, ఆటో వర్కర్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్, చేతి వత్తిదారుల సంఘం జిల్లా కన్వీనర్ గురు శేఖర్, పిఎన్ఎం జిల్లా కార్యదర్శి రాజు, జిల్లా అధ్యక్షులు బసవరాజ్, ఆర్‌పిల సంఘం నాయకులు ఉమాదేవి, రుద్రమ్మ ఎల్ఐసి ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు క్రాంతికుమార్, రమేష్ సిఐటియు నగర నాయకులు సుధాకరప్ప, యేసు, అబ్దుల్ దేశాయ్, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుత్ను తిరుపతయ్య, వేదికపై ఆయా సంఘాల నాయకులు

21వ అఖిలభారత పశుగణన సర్వే

పశు వైద్యాధికారి ప్రణీత

ప్రజాశక్తి -తుగ్గలి

మండల పరిధిలోని తుగ్గలి గిరిగట్ల మంగళవారం 21వ అఖిలభారత పశుగణ సర్వే నిర్వహిస్తున్నామని పశు వైద్య అధికారిని డాక్టర్ ఎస్.ప్రణీత పేర్కొన్నారు. 25-10-2024 నుండి 25-02-2025 వరకు జరిగే 21వ అఖిలభారత పశువుధన సర్వే గురించి మాట్లాడుతూ ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరించడంలో భాగంగా గొర్రెలు, మేకలు, కోళ్లు, తదితర వివరాలు సేకరించాలని తెలిపారు. ఇంటికి వచ్చే విషయం సేకరణదారులకు మీ పశువుల సమగ్ర సమాచారం అందించండి, తద్వారా పశుగణన రంగ పథకాల రూపకల్పనకు సహకరించండన్నారు. పశుగణన సర్వేకు వచ్చినప్పుడు రైతులు గ్రామస్తులు సహకరించాలని పశు వైద్యాధికారిణి ఎస్.ప్రణీత అన్నారు. ఈ కార్యక్రమంలో గోపాలమిత్ర నాయుడు, పశు సంవర్ధక సహాయకుడు వంశి రైతులు పాల్గొన్నారు.

డెంగీ, మలేరియాపై అవగాహన అవసరం

- డిఎంహెచ్ఒ భాస్కర్



మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ భాస్కర్

ప్రజాశక్తి - ఆదోని

డెంగీ, మలేరియాపై అవగాహన కల్పించాలని డిఎంహెచ్ఒ భాస్కర్ సూచించారు. వాతావరణ మార్పులకు అనుగుణంగా సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, క్షేత్రస్థాయిలో పర్యటించి నివారణ చర్యలు వివరించాలని తెలిపారు. మంగళవారం పట్టణంలోని ఎన్‌జిఒస్ హోమ్‌లో ఆశాడే సందర్భంగా అర్బన్ వార్డ్ హెల్త్ సెక్రటరీలకు, ఆశాలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దోమకాటు వల్ల డెంగీ, మలేరియా, చికున్ గున్యా వ్యాప్తి చెందుతాయని తెలిపారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే కచ్చితంగా నిర్వహించాలన్నారు. డెంగీ, మలేరియా, చికున్ గున్యా వ్యాధులు నిర్ధారణ అయిన వెంటనే రోగిని సందర్శించి నివారణ చర్యలు వివరించాలని తెలిపారు. పరిసర ప్రాంతాల్లో బ్లీచింగ్‌తో పారిశుధ్య నివారణ చర్యలు చేపట్టాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా మలేరియా నివారణాధికారి నూకరాజు మాట్లాడుతూ... దోమలు వృద్ధి చెందకుండా ఫ్రైడే డ్రైడే నిర్వహించాలని, ఎక్కడైనా మురుగునీరు నిలిచి ఉంటే శానిటేషన్ సిబ్బందికి వివరించాలని తెలిపారు.

పని భారం తగ్గించండి : పట్టణంలో వార్డు హెల్త్ సెక్రటరీలకు పని భారం తగ్గించాలని డిఎంహెచ్ఒ భాస్కర్‌కు విన్నవించారు. మున్సిపాలిటీ పరిధిలో పింఛన్ల పంపిణీ, ఎలక్షన్ బిఎల్ఒ డ్యూటీలు వేయడం పట్ల రోజువారీ హెల్త్ కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించుకోలేకపోతున్నామని వాపోయారు. వైద్య, ఆరోగ్య శాఖ విధులు కాకుండా ఇతర బాధ్యతల నుంచి తమకు మినహాయింపు ఇవ్వాలని కోరారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని డిఎంహెచ్ఒ భాస్కర్ హామీ ఇచ్చారు.

అపార్, సిసిఇ మార్కుల నమోదును

వేగవంతం చేయండి : ఎంఇఒ శోభారాణి

ప్రజాశక్తి - కౌతాళం

నమోదును పరిశీలిస్తున్న ఎంఇఒ

మండలంలోని వివిధ పాఠశాలల్లో విద్యార్థుల అపార్ ఐడి కార్డ్ నమోదు, సిసిఇ మార్కుల నమోదును వేగవంతం చేయాలని ఎంఇఒ శోభారాణి కోరారు. మంగళవారం మండలంలోని వల్లూరు, గుడి కంబాలి, గోతులదొడ్డి, కుమ్మలనూరు గ్రామాల్లోని పాఠశాలల్లో నమోదును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈనెల 14న జరిగే పేరెంట్స్ డేను విజయవంతం చేయాలని తెలిపారు. గుడికంబాలి పాఠశాలలో వాటర్ ట్యాంక్ లీకై నీరు పాఠశాల ప్రాంగణంలో నిలుస్తోందని, విద్యార్థులకు అసౌకర్యంగా ఉందని సర్పంచి సిద్దేష్, గ్రామ నాయకులు శ్రీనివాసులు, స్కూల్ కమిటీ ఛైర్మన్ ముల్లా ఖాజా ఎంఇఒ దృష్టికి తీసుకొచ్చారు. బాత్‌రూంలు, ఆ ట్యాంకును తొలగించి వేరేచోట ఏర్పాటు చేయాలని కోరారు. ఉపాధ్యాయుల సమస్య ఉండడంతో ఒక వాలంటీరును నియమించాలని ఎంఇఒను కోరారు. వాలంటీరు వ్యవస్థ ప్రస్తుతం లేకపోవడంతో గ్రామస్తులే నియమించుకోవాలని ఎంఇఒ సూచించారు. సర్పంచి సిద్దేష్ రూ.3 వేలు, స్కూల్ కమిటీ ఛైర్మన్ ముల్లా ఖాజా రూ.2 వేలు విద్యా వాలంటీరుకు గౌరవ వేతనం ఇవ్వడానికి ముందుకు రావడం అభినందనీయమని ఎంఇఒ శోభారాణి తెలిపారు.

మార్కెట్ యార్డులో సబ్ కలెక్టర్, ఎమ్మెల్యే పర్యటన

ప్రజాశక్తి - ఆదోని రూరల్

ఆదోని మార్కెట్ యార్డులో సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, ఎమ్మెల్యే పార్థసారథి పర్యటించారు. మార్కెట్ యార్డు కార్యాలయంలో అధికారులతో కలిసి మార్కెట్ యార్డులో ఏర్పాటు చేయాల్సిన షెడ్లు, డ్రెయిన్స్, రైతులకు అవసరమైన తాగునీరు, టాయిలెట్స్, మౌలిక సదుపాయాలు, మార్కెట్ యార్డులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మంగళవారం సమీక్ష నిర్వహించారు. అనంతరం అధికారులు స్థానిక ఎమ్మెల్యేతో కలిసి మార్కెట్ యార్డుకు వచ్చిన రైతులతో వారి సమస్యలను తెలుసుకున్నారు. మార్కెట్ యార్డులో విశ్రాంతి భవనం, తాగు నీరు, తూకాలు తదితర వాటిని పరిశీలించారు. తహశీల్దార్ శివరాముడు, మున్సిపల్ కమిషనర్ కృష్ణ, మార్కెట్ యార్డు అసిస్టెంట్ కమిషనర్ శాంత కుమార్ పాల్గొన్నారు.

రైతులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్, ఎమ్మెల్యే

మున్సిపల్ పాఠశాలల్లోని

ఉపాధ్యాయ ఖాళీల్లో గందరగోళం

- అగెనెస్ట్ పోస్టుల భర్తీ జరిగేనా..? - ఉపాధ్యాయుల్లో సందేహాలు..!

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలోని మున్సిపల్ పాఠశాలల్లో ఉన్న ఉపాధ్యాయ ఖాళీల పట్ల స్పష్టత లేకపోవడంతో గందరగోళం నెలకొంది. అగెనెస్ట్ (పోస్టు ఒక ఉండడం, విధులు వేరే చోట నిర్వహించడం) పోస్టుల్లో జీతాలెందుకు ఇస్తున్నారన్న ప్రశ్న తలెత్తుతోంది. ఆ పోస్టుల భర్తీ జరిగేనా అన్న సందేహాలు ఉపాధ్యాయుల్లో నెలకొన్నాయి. ఖాళీల జాబితా నిష్పాక్షికంగా లేదన్న అనుమానాలు కలుగుతున్నాయని ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఆ జాబితాలో లొసుగులు అధికారులకు ఎరుక లేకనా, లేక కుమ్మక్కు అయ్యారా అన్న ప్రశ్న ఉపాధ్యాయుల నోట నానుతోంది. మున్సిపల్ ఉపాధ్యాయ నిర్వహణ బాధ్యత ప్రస్తుతం విద్యాశాఖ పరిధిలో ఉన్నా ఇప్పటికీ అవకతవకలేనా అంటూ ప్రశ్నిస్తున్నారు.

ఆదోని పురపాలక సంఘానికి రాష్ట్రంలోనే ప్రత్యేక స్థానం ఉంది. ఇటీవల విద్యాశాఖ మున్సిపల్ ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతులు చేపట్టేందుకు కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆదోని పురపాలక పరిధిలోని నాలుగు ఉన్నత పాఠశాలల్లో, ఒక ప్రాథమిక ఉన్నత పాఠశాలలోని పోస్టులపై ఇప్పటికీ స్పష్టత లేదు. దీంతో క్షేత్రస్థాయిలో మున్సిపల్ ఉపాధ్యాయుల్లో అధికారుల తీరుపై గుసగుసలు వినిపిస్తున్నాయి. 2005, 2015 సంవత్సరాల్లో మున్సిపల్ కమిటీ ఆధ్వర్యంలో ఉద్యోగోన్నతులు జరిగాయి. వాటిలో జరిగిన అవకతవకలు అప్పట్లో బయటపడలేదు. హోల్‌సేల్ విధానంలో లాగా అన్ని పాఠశాలల్లోని పోస్టులకు గంపగుత్తగా మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో జీతభత్యాలు ఇచ్చే వారు. ఎప్పుడైతే విద్యాశాఖ కిందికి మున్సిపల్ పాఠశాలల్లోని ఉపాధ్యాయులు వచ్చారో అప్పుడు రిటైల్ రంగంలో లాగా ప్రతి పాఠశాలకూ మున్సిపల్ ఉపాధ్యాయులను ఆయా పాఠశాలల్లో మంజూరయిన పోస్టుల సంఖ్య, భర్తీ చేసిన పోస్టుల సంఖ్య, ఖాళీగా ఉన్న పోస్టుల సంఖ్యల్లో కొందరు ఉపాధ్యాయుల ఇష్టం మేరకు అధికారులు నిబంధనలను తుంగలో తొక్కి పోస్టులను కేటాయించారు. ఫలితంగా నెహ్రూ స్మారక పురపాలక ఉన్నత పాఠశాలలో పోస్టులు లేనప్పటికీ ఒక పిఇటి, ఒక ఆంగ్ల పాఠశాల సహాయకులు ఎస్ఎ (పిఎస్)లో అగెనెస్ట్‌గా జీతం పొందుతున్నారు. 2015లో జరిగిన ఉద్యోగోన్నతుల్లో అండర్ పేట్‌లోని ఉర్దూ మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలలోని ఆంగ్ల పాఠశాల సహాయకుల పోసుటను భర్తీ చేశారు. దశాబ్దం కావస్తున్నా ఇప్పటికీ సందర్భానుసారంగా భర్తీ చేసినట్లు, భర్తీ చేయకుండా ఖాళీగా ఉన్నట్లు చూపుతూ అధికారులు దాగుడు మూతలు ఆడుతున్నారు. ఈ విషయం ఎన్నో సార్లు అధికారుల దృష్టికి వెళ్లినా పరిష్కారానికి నోచుకోలేదు. ప్రస్తుతం ఆర్ఆర్ లేబర్ కాలనీలో పని చేసే ఒక ఉపాధ్యాయుడు డిప్యూటేషన్ ముగించుకుని ఏప్రిల్ 30, 2023న ఆ హైస్కూల్‌లో చేరాక మూడు నెలల జీతం చేసి, తర్వాత అతనిని పోస్టుతో సహా అధికారులు షిఫ్ట్ చేశారు. కిల్చినపేట్ మున్సిపల్ ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేసే ఒక పాఠశాల సహాయకునికి ఈ పాఠశాలలోని ఒక పోస్టులో అగెనెస్ట్‌గా జీతం మంజూరు చేస్తున్నారు. ఇలా ఎన్నో ఉన్నాయని చెబుతున్నారు. ప్రస్తుతం జరగబోయే ఉద్యోగోన్నతుల్లో ఆ పోస్టులను ఖాళీగా చూపించి భర్తీ చేస్తారా, లేక అగెనెస్ట్ పోస్టుల్లో జీతాలు పొందుతున్న వారి కోసం భర్తీ చేయకుండా ఉంచుతారా? అన్నది సందేహంగా మారింది. జిల్లా అధికారులు జోక్యం చేసుకొని జరిగిన తప్పిదాలను సరిచేయాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు.

గ్రామసభల ద్వారా భూసమస్యల పరిష్కారం : తహశీల్దార్

- గ్రామసభలో 281 వినతిపత్రాలు స్వీకరణ

ప్రజాశక్తి - పెద్దకడబూరు

గ్రామసభల ద్వారా భూ సమస్యలను పరిష్కరిస్తామని తహశీల్దార్ శ్రీనాథ్ తెలిపారు. మంగళవారం పెద్దకడబూరులోని సొసైటీ మైదానంలో గ్రామసభ నిర్వహించారు. తహశీల్దార్ శ్రీనాథ్ మాట్లాడుతూ... రీసర్వేలో తలెత్తిన భూ సమస్యలను గ్రామసభల ద్వారా పరిష్కరిస్తామని పేర్కొన్నారు. రైతులు భూసమస్యలపై సరైన పత్రాలతో దరఖాస్తు సమర్పించాలని కోరారు. రైతులు గ్రామసభకు సమర్పించిన వినతులను అతి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం రైతుల సమస్యలను తెలుసుకుని, 281 దరఖాస్తులను రైతుల నుంచి స్వీకరించారు. మండల సర్వేయర్ తేజస్విని, విఆర్ఒలు నరసన్న, వీరారెడ్డి, ఆదెప్ప, మాదన్న, శ్రీనివాసులు, గురురాజరావు పాల్గొన్నారు.

వినతులు స్వీకరిస్తున్న తహశీల్దార్

గుంతల్లేని ఆంధ్రప్రదేశ్ నిర్మాణమే ధ్యేయం

- ఎమ్మిగనూరు నుంచి కర్నూలు-బళ్లారి నేషనల్ హైవేకు తొలి అడుగు : ఎమ్మెల్యే బీవీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

గత వైసిపి ప్రభుత్వం రాష్ట్రంలో ఒక్క గుంతను కూడా పూడ్చిన దాఖలు లేవని, గుంతల్లేని ఆంధ్రప్రదేశ్ నిర్మించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి తెలిపారు. మంగళవారం పట్టణంలోని వివిధ రహదారి నిర్మాణ పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. శివ సర్కిల్ నుంచి ఎద్దుల మార్కెట్ మీదుగా కర్నూలు-బైపాస్ రోడ్డు వరకు ర్యాలీగా వచ్చి రోడ్డు పనులను జెసిబి ద్వారా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీవీ మాట్లాడారు. 2014లో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు వేసిన రోడ్డే 2024 తాను ఎమ్మెల్యేగా నేడు రోడ్డు పనులను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గుంతల రోడ్ల నిర్మాణానికి రూ.200 కోట్లు విడుదల చేసినట్లు చెప్పారు. త్వరలోనే ఎమ్మిగనూరు నుంచి కర్నూలు-బళ్లారి నేషనల్ హైవే ఏర్పాటుకు తొలి అడుగు పడనుందని తెలిపారు. వైసిపి విష ప్రచారాలు చేస్తోందని, ప్రజలు 151 సీట్ల నుంచి 11కు దించారని చెప్పారు. ప్రస్తుతం వైసిపి క్రికెట్ టీం ఉందని, రానున్న రోజుల్లో షటిల్ టీం అవుతుందని ఎద్దేవా చేశారు. త్వరలోనే ఎమ్మిగనూరులో మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టిఆర్, మాజీ మంత్రి బీవీ.మోహన్ రెడ్డి విగ్రహాల ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఆర్అండ్‌బి డిఇలు నాగరాజు, రవిచంద్ర, జనసేన నాయకులు రేఖ గౌడ్, బిజెపి నాయకులు నరసింహులు, వార్డు ఇన్‌ఛార్జీ మహబూబ్ బాషా, టిడిపి నాయకులు రంగస్వామి గౌడ్, రామకృష్ణ, బందే నవాజ్, బడే సాహెబ్, అంబేద్కర్, అల్తాఫ్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీవీ

మహారాజశ్రీ కందుకూరు సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

O.S.No. 48 / 2016

టంగుటూరి గోవిందరావు, & వగైరాలు - వాదులు

Vs

మూలె బైరెడ్డి & వగైరాలు - ప్రతివాదులు

టు,

D17). **లక్కు లక్ష్మీ,** W/o **వెంకటేశ్వర్లు,**
అదోని గ్రామం మరియు మండలం,
కర్నూలు జిల్లా.

పై నెంబరు దావాలోని పరిహారం డిక్రీ కోరి మీ మీద వాదులు దాఖలు చేసియుండుట వలన మీరు స్వయంగా కానీ, మీ నుంచి సంపూర్ణ సంజాయిషీ పొందిన లాయరు ద్వారా కానీ సదరు దావా ప్రత్యుత్తరములు చెప్పగలందుకు **తే22-11-2024 దికి** వాయిదా వేయబడియున్నది. కావున పై తేదీన **ఉదయం 10.30 ని॥లకు** పై కోర్టు వారి యెదుట హాజరై మీ సంజాయిషీ వ్రాతమూలకంగా తెలుపుకోవలసినదిగా మిమ్ము ఆదేశించడమైనది. పై తేది యందు మీరు హాజరు కాని యెడల మీ పరోక్షమందు పై దావా తీర్మానించెదరు.

వాయిదా తేది: 22-11-2024

పై కోర్టు వారి ఉత్తర్వుల మేరకు
శ్రీ టి.గోపాలకృష్ణ మూర్తి
వాదులు తరపు న్యాయవాది, కందుకూరు

ఆశాలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

- సిఐటియు జిల్లా హనుమంతు

ప్రజాశక్తి - ఆస్పరి

ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సిఐటియు జిల్లా నాయకులు హనుమంతు డిమాండ్ చేశారు. మంగళవారం ఎపి ఆశావర్కర్స్ యూనియన్ మండల నాయకులు లక్ష్మి, భువనేశ్వరి అధ్యక్షతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం దగ్గర ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రతినిధి వర్గంతో జరిపిన చర్చలో కుదిరిన ఒప్పందాలపై జిఒలు, సర్క్యులర్లు విడుదల చేయాలని కోరారు. 9 నెలలు కావస్తున్నా జిఒలు విడుదల కాకపోవడంతో ఆశాలు ఆందోళనకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం డాక్టర్ మాధవిలతకు వినతి పత్రం అందజేశారు. సిఐటియు మండల నాయకులు రంగస్వామి, డివైఎఫ్ఐ మండల నాయకులు నాగరాజు, విఠల్, ఆశావర్కర్లు ప్రభావతి, వసుంధర, ఈరమ్మ, లక్ష్మీదేవి, లలిత, గోవిందమ్మ, ఇంద్రమ్మ, జయమ్మ, పుష్ప పాల్గొన్నారు. **ఆదోని** పట్టణంలోని ఎన్‌జిఒస్ కార్యాలయంలో సిఐటియు ఆధ్వర్యంలో డిహెచ్ఎంఒ భాస్కర్‌కు వినతిపత్రం అందజేశారు. ఆశావర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని సిఐటియు పట్టణ అధ్యక్షులు తిప్పన కోరారు. అలాగే మండలంలోని పెద్దతుంబలం మెడికల్ ఆఫీసర్‌కు మండల కార్యదర్శి వీరారెడ్డి, పెద్దహరివాణం మెడికల్ ఆఫీసర్‌కు మండల నాయకులు తిక్కప్ప వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. ఆశావర్కర్స్ యూనియన్ మండల కార్యదర్శి రాజేశ్వరి మాట్లాడారు. నాగమ్మ, లత, త్రివేణి, గిరిజ, జాయిభ, మంజుల పాల్గొన్నారు. **హోళగుందలో** భోజన విరామ సమయంలో హోళగుంద వైద్యాధికారి న్యూటన్‌కు వినతి పత్రం అందజేశారు. అలాగే కోసిగి వైద్యాధికారి మనోజ్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. సిఐటియు మండల కార్యదర్శి నాగరాజు పాల్గొన్నారు.

ఆస్పరిలో డాక్టర్ మాధవి లతకు వినతిపత్రం అందజేస్తున్న ఆశాలు

ఆదోనిలో వినతిపత్రం ఇస్తున్న నాయకులు

హోళగుందలో వినతిపత్రం ఇస్తున్న నాయకులు

IN THE COURT OF PRINCIPAL JUNIOR CIVIL JUDGE : DHONE
OS.No.521/2023

Andhra pragathi Grameena Bank Rep by its Manager, Veldurthi. ...Plaintiff

Vs

J. వీరారెడ్డి చనిపోయినందున
ఇతని వారసులు
1) జుట్ల అనంతమ్మ
భర్త J. వీరారెడ్డి
గుంటుపల్లి గ్రామం,
వెల్దుర్తి మండలం,
కర్నూలు జిల్లా. ...ప్రతివాది నెం.1

ప్రతివాది సమన్స్

పై దావాను బ్యాంకు వారు late veera Reddy crop loan వసూలు కోసం దావా దాఖలు చేసినారు. నీవు వారసురాలుగా ఉండి, కోర్టు సమన్స్ తీసుకొనక తప్పించుక తిరుగుతున్నావు. కావున పై కోర్టు నందు 14-11-2024వ తేదిన ఉ॥ 10-30 గంటలకు నీవు కాని నీ తరుపున వకీలు కాని హాజరై ఆక్షేపణలు ఉన్న యడల తెలుపుకోవచ్చును. లేనంతట నీ పరోక్షమందు తీర్మాణించబడును.

(కోర్టు వారి ఉత్తర్వు మేరకు)

వాయిదా తేది : 14-11-2024

M.Gopal Reddy,
B.com B.L.,
Advocate,
Dhone, Nandyal Dist.
Cell : 9440557898

నేడు వామపక్షాల కేంద్ర, రాష్ట్ర నాయకుల పర్యటన

ప్రజాశక్తి- దేవనకొండ

దేవనకొండ మండలం కప్పట్రాళ్ల ఫారెస్ట్ భూముల్లో యురేనియం తవ్వకాలకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలని బుధవారం వామపక్ష నాయకులు పర్యటించనున్నట్లు సిపిఎం జిల్లా నాయకులు బి.వీరశేఖర్, సిపిఐ మండల కార్యదర్శి నరసరావు తెలిపారు. మంగళవారం వారు మాట్లాడారు. ప్రజల జీవనాన్ని, పశు, వృక్ష సంపదను కాపాడాలని కోరుతూ సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే ఎం.ఎ.గఫూర్, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పర్యటించనున్నట్లు తెలిపారు. వామపక్షాల సానుభూతిపరులు, నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

విధులను సక్రమంగా నిర్వహిస్తాం

- ఎఎన్ఎం వరాలమ్మ

ప్రజాశక్తి - ఆస్పరి

గ్రామంలో ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తానని బిల్లేకల్లు ఎఎన్ఎం వరాలమ్మ తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడారు. తాను విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నా అన్నమాట అవాస్తవమని తెలిపారు. గ్రామంలో ఎవరైనా వైద్య సేవల నిమిత్తం తమ దగ్గరికి వస్తే వైద్య సేవలు అందిస్తున్నామని చెప్పారు. తాను సరైన వేళలో హాజరు అవుతున్నానని తెలిపారు. సచివాలయానికి వచ్చిన ప్రజలు, గర్భిణులు, పిల్లలకు సరైన వైద్యం అందించడమే తన బాధ్యత అన్నారు.

లైన్ కండక్టర్ మార్పుతో విద్యుత్‌కు అంతరాయం

- విద్యుత్ ఎఇ గోవిందు

ప్రజాశక్తి - మంత్రాలయం

లైన్ కండక్టర్ మార్పుతో రైతులకు విద్యుత్ అంతరాయం ఉంటుందని విద్యుత్ ఎఇ గోవిందు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడారు. బుధవారం ఉదయం నుంచి కర్నూలు నుంచి ఎమ్మిగనూరుకు వచ్చే 132 కెవి లైన్ కండక్టర్‌ను మార్చుతున్నామని తెలిపారు. అందులో భాగంగా ఈనెల 6 నుంచి రైతులకు 3ఫేజ్ విద్యుత్ ఉదయం పూట 6 గంటలు, రాత్రి వేళ 3 గంటలు ఇస్తామని అన్నారు. ఈ విధంగా సుమారు 30 రోజుల పాటు ఈ విద్యుత్ సరఫరా అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. లైన్ కండక్టర్‌ను నియమించిన తర్వాత విద్యుత్ సరఫరా యథావిధిగా ఉంటుందని అన్నారు. రైతులు గమనించి, సహకరించాలని కోరారు.

మాట్లాడుతున్న డిఎల్‌పిఒ భద్రప్ప

చెత్త రహిత గ్రామాలుగా తీర్చదిద్దడమే లక్ష్యం

- డిఎల్‌పిఒ భద్రప్ప

ప్రజాశక్తి - చిప్పగిరి

ప్రతి గ్రామాన్ని చెత్తరహితంగా తీర్చదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని పత్తికొండ డిఎల్‌పిఒ భద్రప్ప తెలిపారు. మంగళవారం చిప్పగిరి సచివాలయ కార్యాలయంలో ఇఒఆర్‌డి బాలన్న ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. రికార్డులను పరిశీలించిన అనంతరం డిఎల్‌పిఒ మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామాల్లో స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. తడిపొడి చెత్తను స్వీకరించి విడివిడిగా వర్మీకంపోస్టు ద్వారా ఎరువుగా తయారు చేయాలన్నారు. ట్యాంకులను 15 రోజులకోసారి తప్పనిసరిగా శుభ్రం చేయించేలా పంచాయతీ కార్యదర్శులు బాధ్యత తీసుకోవాలని ఆదేశించారు. వీధులలో బల్బులు వెలుగుతున్నాయా లేదా చూసుకోవాలన్నారు. ప్రజలందరికీ నీరందేలా ఆర్‌డబ్ల్యుఎస్ కార్మికులు ఒక సమయం, ప్రకారం నీటి సరఫరా చేయాలని సూచించారు. గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా నిరంతరం పారిశుధ్య పనులు చేపడుతూనే ఉండాలన్నారు. పారిశుధ్య కార్మికులకు నెలల తరబడి జీతాలు పెండింగ్‌లో లేకుండా ఒక క్రమపద్ధతిలో వచ్చేలా చూసుకోవాలని తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు సురేంద్ర, సుధీర్, నరసింహులు, జై రామ్‌నాయక్, ప్రమీల పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పారిశుధ్య పనులను మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి పరిశీలించారు. మంగళవారం పట్టణంలోని సోమప్ప సర్కిల్‌లో పారిశుధ్య పనులను, డ్రైనేజీ పనులను దగ్గరుండి పారిశుధ్య కార్మికులతో చేయించారు. పట్టణంలో పారిశుధ్యం సంపూర్ణంగా ఉండడానికి కృషి చేస్తున్నామని తెలిపారు.

వంద పడకల ఆస్పత్రి నిర్మించాలి

- మంత్రి టిజి.భరత్‌కు వినతి

ప్రజాశక్తి - కౌతాళం

కౌతాళంలో వంద పడకల ఆస్పత్రి మంజూరు చేసి నిర్మించాలని మంత్రి టిజి.భరత్‌ను బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, హైకోర్టు సీనియర్ న్యాయవాది పురుషోత్తం రెడ్డి కోరారు. మంగళవారం ఆయన మాట్లాడారు. జిల్లాలో అన్ని రంగాల్లో అత్యంత వెనుకబడిన మండలమైన కౌతాళంలో సరైన వైద్య సౌకర్యాలు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎన్నికల ప్రచారంలో ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వంద పడకల ఆస్పత్రిని మంజూరు చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. గత వారంలో రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్‌ను, ఇప్పుడు టిజి.భరత్‌ను కోరినట్లు తెలిపారు. మంత్రులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి మంజూరు చేయించాలని కోరారు. కౌతాళం మండల నాయకులు నబి సాబ్, రామచంద్ర, లింగన్న పాల్గొన్నారు.

మంత్రి భరత్‌కు వినతిపత్రం అందజేస్తున్న పురుషోత్తం రెడ్డి

సాగు నీటి ప్రాజెక్టులపై దృష్టి సారించాలి

- మంత్రిని కోరిన సాయిబాబు

ప్రజాశక్తి - ఆదోని

మంత్రికి వినతి పత్రం ఇస్తున్న సాయిబాబు

రాష్ట్రంలోనే అత్యం త వెనుకబడి ఉన్న కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతంలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం జరిగేలా దృష్టి సారించాలని తెలుగు రైతు జిల్లా అధికార ప్రతినిధి సాయిబాబు కోరారు. డివిజన్‌లోని సాగునీటి వనరుల గురించి, పెండింగ్ ప్రాజెక్టుల స్థితిగతులపై రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జీ మంత్రి నిమ్మల రామానాయుడుకు కర్నూలులో వినతిపత్రం ఇచ్చామని చెప్పారు. మంగళవారం ఆయన మాట్లాడారు. వలసల నివారణ, వ్యవసాయం అభివృద్ధికి, నీటి పారుదల ప్రాజెక్టుల నిర్మాణానికి ఆదోని డివిజన్‌లో అనుకూల పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. సాగునీటి వసతి ఉందని, అందువల్ల ప్రాజెక్టుల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని కోరారు. జిల్లాలోని సాగునీటి వసతిని అంచనా వేస్తూ డిపిఆర్ తయారు చేయాలని జిల్లా అధికారులను ఆదేశించాలని తెలిపారు. రాష్ట్రంలో ఒక్క కర్నూలు పార్లమెంట్‌లోని 7 నియోజకవర్గాలకు 150 టిఎంసిల నీరు అవసరముండగా కేవలం 10 టిఎంసిలే అందుతోందని చెప్పారు. జిల్లా రైతులు వ్యవసాయరంగంలో అధికంగా నష్టపోతున్నారని తెలిపారు. రైతులు కేవలం మెట్ట పంటలపై ఆధారపడడం వల్ల దిగుబడులు లేక వలసలు పోతున్నారని చెప్పారు. ఈ విషయంపై ప్రత్యేక దృష్టి పెట్టి రైతులను ఆదుకోవాలని కోరారు. ప్రతేడాది సుమారు 200 టిఎంసిల వరదనీరు తుంగభద్ర, వేదవతి నదుల నుంచి శ్రీశైలం ప్రాజెక్టు ద్వారా వృథాగా సముద్రంలో కలుస్తున్నాయన్నారు. వేదవతి నది నీటిని వాడుకోవడానికి గుంతకల్లు, బళ్లారి రహదారిలో హగరి వద్ద ఒక ప్రాజెక్టు నిర్మించి గ్రావిటీ ద్వారా వేదవతి ప్రాజెక్టుకు అనుసంధానం చేయాలని కోరారు. మంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు.

జిల్లా స్వర్ణోత్సవ మహాసభలను జయప్రదం చేద్దాం : యుటిఎఫ్

ప్రజాశక్తి - ఆదోని

ఈ నెల 9, 10న గూడూరులో జరిగే యుటిఎఫ్ జిల్లా స్వర్ణోత్సవ మహాసభలు జయప్రదం చేయాలని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి గాది లింగప్ప కోరారు. మంగళవారం ఆదోని యుటిఎఫ్ కార్యాలయంలో గోడపత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఉపాధ్యాయుల వాణిని వినిపించేందుకు అందరూ ఐక్యం కావాలని తెలిపారు. రామాంజనేయులు, రుద్రముని, నరసయ్య గౌడ్ ఉన్నారు.

సేవా దృక్పథం హర్షణీయం

- డీఎస్పీ ఉపేంద్ర బాబు
- ఘనంగా ఎపిడబ్ల్యుజెఫ్ ఆవిర్భావ దినోత్సవం
- రెండు అంబులెన్స్‌లు ప్రారంభం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పత్రిక విలేకరులు, ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ సభ్యులు సేవాదృక్పథం కలిగి ఉండడం హర్షణీయమని ఎమ్మిగనూరు డీఎస్పీ ఎం.ఉపేంద్ర బాబు, ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుధా, పట్టణ సిఐ సుదర్శన్ రెడ్డి, యాపిల్ ల్యాబ్ అధినేత బీరప్ప తెలిపారు. మంగళవారం ఎపిడబ్ల్యుజెఎఫ్ 17వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. అనంతరం అత్యవసర చికిత్స నిమిత్తం కర్నూలుకు తరలించేందుకు రెండు ఉచిత అంబులెన్స్‌లను ప్రారంభించారు. ఈ అంబులెన్స్‌లో చిన్నారులు, పెద్దలకు సైతం ఆక్సిజన్ సౌకర్యం కూడా కలిగి ఉంటుందని, అంబులెన్స్ ఉపయోగించేవారు డీజిల్, డ్రైవర్ భత్యం, ఆక్సిజన్ సిలిండర్ కోసం రూ.2500 చెల్లించాల్సి ఉంటుందని ఎపిడబ్ల్యుజెఎఫ్ ఎమ్మినూరు శాఖ అధ్యక్షులు కె.షబ్బీర్ తెలిపారు. డీఎస్పీ సురేంద్రబాబు, పట్టణ సిఐ సుదర్శన్ రెడ్డి, ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుధా మాట్లాడారు. ఎపిడబ్ల్యుజెఎఫ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ప్రభుత్వాస్పత్రిలో జరుపుకోవడం హర్షణీయమని అన్నారు. అనంతరం వైద్యశాలలో ఆర్థో వైద్యులు డాక్టర్ మల్లికార్జున, విలేకరులు కలిసి బాలింతలు, రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. ఎపిడబ్ల్యుజెఎఫ్ గౌరవాధ్యక్షులు దేవేంద్ర మూర్తి, ఫెడరేషన్ నాయకులు వీరేష్ ఆచారి, అబ్దుల్ గఫూర్, హనుమంతరావు, అబ్దుల్ హక్, ఈరన్న, ఖాదర్ బేగ్, అంబులెన్స్ డ్రైవర్లు గౌస్ సుహెల్, ఖాతాల్, నాయుడు, షేక్షా, నరసింహ నాయుడు, ఖాజా సాహెబ్ పాల్గొన్నారు. **ఆలూరు** తాలూకా కమిటీ ఆధ్వర్యంలో చిప్పగిరిలోని ఎంపిపి కార్యాలయంలో ఎపిడబ్ల్యుజెఎఫ్ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా వైసిపి మండల కన్వీనర్ జూటూరు మారయ్య పాల్గొని కేక్ కట్ చేశారు. అంతకుముందు మండల కన్వీనర్‌కు శాలువా కప్పి పూలమాలతో సన్మానించారు. ఎపిడబ్ల్యుజెఎఫ్ తాలూకా కమిటీ నాయకులు కృష్ణ, గోవిందరాజులు, యూసుఫ్, రవి, నాగరాజు, మండల కార్యాలయం అధికారులు శ్రీనివాసులు, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మిగనూరులో మాట్లాడుతున్న డీఎస్పీ ఉపేంద్ర బాబు

ఆలూరు : కేక్ కట్ చేస్తున్న మారయ్య

IN THE COURT OF HON'BLE Addl. SENIOR CIVIL JUDGE: KURNOOL
I.A.No:535/2023 in I.A.: 764/2017
in O.S. No: 212/2009

(1) Smt. Salima Bee, W/o Mohammad Basha, Plot No. 65, Netaji Housing Colony, Weaker Section Colony, S.A.P. Camp P.O. Kurnool.
(2) Smt. Fathima Bi, W/o Moulali, D. No. 10/37-A 1, Osmania College Road, KURNOOL.
(3) Smt. Zubeda Bi, W/o Md. Yousuf, D.No. 46/383-J 2140, Budhawarapet, KURNOOL.
(4) Sri Md. Jameel Basha, S/o Late Md. Ansari, D.No. 5/71, Osmania College Road, Kurnool.
(5) Smt. Mahamooda Bee @ khurshida Banu, W/o Ibrahim Miah, Plot No. 63, Netaji Housing Colony, Weaker Section Colony, S.A.P. Camp P.O. Kurnool.
...Petitioners/Plaintiffs

-VS-

(1) Smt. Hajira Bí, W/o Allabaksh, Back side of Ismail Masjid, Industrial Estate Road, Kallur, KURNOOL.
(2) Sri Md. Ismail (Died by his L.Rs 4th Respondent)
(3) Sri Muneer, S/o Ahmed Miah, D.No. 3/144, Osmania College road, KURNOOL.
(4) Smt. Farzana Begum, W/o M. Ameer Baig, D.No.76/97-289-2-1, Netaji Housing Colony, Near Vasu Hotel, Kurnool.

వేలము ప్రకటన

ఈ క్రింది షెడ్యూలులో కనపరచిన ఆస్తిని పైన కనపరచిన అర్జిదారులు మరియు ప్రతివాదుల మధ్యలో వేలము వేయమని పై కోర్టు వారు, నన్ను అడ్వకేట్ - కమీషనరుగా నియమించి ఉన్నారు. సదరు వేలము 16/11/2024 తేదీ శనివారం ఉదయం 10.30 గంటలకు పై కోర్టు భవనంలోనే జరుపబడును. పై అర్జిదారులు మరియు ప్రతివాదులు ఆ వేలములో పాల్గొనవలెనని ఇందుమూలముగా తెలుపడమైనది.

SCHEDULE:
House bearing D.No.5/71-B, situated in survey No.50, Dr.Gaffar's street, Osmania college road, peta kurnool city, Kurnool District, Kurnool Sub Division, Kurnool Registration. District.

Bounded by:
East : House of Osman Miah D.No.5/71;
West : Abdul Azeez House;
North : Road;
South : House of Hakeem Akthar.

పై కోర్టు ఉత్తర్వుల మేరకు

N. **నాగప్ప**
అడ్వకేట్ - కమీషనరు,
కర్నూలు.
Coll. 9963996301.

సమావేశంలో మాట్లాడుతున్న ఉమ్మడిజిల్లాల కార్యదర్శి నర్సింహులు

అమరుల ఆశయ సాధనకు కృషి

- సిపిఐఎంఎల్ న్యూ డెమోక్రసీ

ప్రజాశక్తి - నంద్యాల

భూమి, భుక్తి, దేశం కోసం పోరాడి అమరులైన సిపిఐఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ అగ్ర నాయకుల ఆశయ సాధనకు ఉద్యమించాలని నేతలు పేర్కొన్నారు. సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ అమరవీరుల సంస్మరణ సభను మంగళవారం స్థానిక ఆల్ మదర్ ఫౌండేషన్ కార్యాలయంలో చౌడప్ప అధ్యక్షతన నిర్వహించారు. ఉమ్మడి జిల్లా కార్యదర్శి వై నరసింహులు, నంద్యాల కార్యదర్శి ఎం.శంకర్, అఖిలభారత రైతుకూలీ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బి ఆనంద్‌లు మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయడంలో విఫలమైం దన్నారు. పెంచిన విద్యుత్ ఛార్జీలు, పెరిగిన నిత్యావసర మరియు కూరగాయల ధరలను తగ్గించాలని అమరుల స్ఫూర్తితో ప్రతిఘటన పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టియు నాయకులు డి ఫారుక్ రఫీ, భవన నిర్మాణ కార్మిక సంఘం డివిజన్ నాయకులు పటాన్, రైతు కూలి సంఘం నాయకులు అల్లా బకాష్, రోషి రెడ్డి, పెద్దిరెడ్డి, రమణమ్మ, శివ, అశోక్ తదితరులు పాల్గొన్నారు. సభ ప్రారంభానికి ముందు రెండు నిమిషాలు మౌనం పాటించి అమరులకు జోహార్లు అర్పించారు.

9న వ్యాస రచన పోటీలు

ప్రజాశక్తి - నంద్యాల

ఈ నెల 11న జాతీయ విద్యా దినోత్సవం పురస్కరించుకుని ఐఎంఏ, లయన్స్ క్లబ్ సంయుక్త నిర్వహణలో ఈ నెల 9న భారతరత్న అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా రామకృష్ణ డిగ్రీ కళాశాలలో ప్రభుత్వ, ప్రవేట్ పాఠశాలల విద్యార్థులకు తెలుగు, ఆంగ్ల భాషలలో విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించనున్నట్లు సమన్వయకర్త డాక్టర్ రవికృష్ణ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ 'మౌలానా అబుల్ కలాం ఆజాద్ జీవితం– సందేశం' అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామన్నారు. పాల్గొనదలచిన వారు ఈ నెల 7వ తేదీ సాయంత్రం 6 గంటల లోపు లయన్స్ క్లబ్ అధ్యక్షులు నిజాముద్దీన్ 9866367560 నెంబర్‌కు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. విజేతలకు 11వ తేదీ రోటరీ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో నిర్వహించే కార్యక్రమంలో ఐఎంఏ నంద్యాల అధ్యక్షులు డాక్టర్ మధుసూదనరావు, నంద్యాల లయన్స్ క్లబ్ అధ్యక్షులు నిజాముద్దీన్ సహకారంతో బహుమతులుగా దేశ నాయకుల పుస్తకాలు, జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందజేస్తామన్నారు.

సస్యరక్షణతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి - చాగలమర్రి

రైతులు సస్యరక్షణ పద్ధతిలో వ్యవసాయం చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయ అధికారి రంగనేతాజీ తెలిపారు. మండలంలోని పెద్దవంగలి, చిన్నవంగలి గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ప్రస్తుత వాతవరణ పరిస్థితులకు అనుగుణంగా వివిధ పంటలలో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి ఆయన రైతులకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత వర్షాలకు మినుము పంట పొడవుగా పెరిగి పూత తక్కువగా ఉండడం గమనించామని, వీటికి ప్లానోఫిక్స్ మందు పిచికారి చేసుకోవడం వలన పూత అధికంగా వస్తుందన్నారు. శనగ పంటలో ట్రైకోడర్మ విరిడితో విత్తన శుద్ధి చేసుకోవడం వలన వేరుకుళ్ళు, మొదలు కుళ్ళు వంటి తెగుళ్ళను నివారించవచ్చని తెలిపారు. పశు వైద్యాధికారిణి దీపకుమారి మాట్లాడుతూ పశు భీమా, నట్టల మందు, టీకాల గురించి వివరించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

ఉర్దూ సెమినార్‌కు విశేష స్పందన

ప్రజాశక్తి - నంద్యాల

ఉర్దూ సాహిత్య కమిటీ కార్వానె ఉర్దూ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన ఉర్దూ సెమినార్‌కు విశేష స్పందన లభించింది. కార్వానె ఉర్దూ వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్దుల్ సమద్ అధ్యక్షతన నిర్వహించిన ఉర్దూ సెమినార్‌లో ముఖ్య అతిథిగా కళాశాల ప్రిన్సిపల్ కరీముల్లాహ్ పాల్గొన్నారు. 'అల్లామ ఇక్బాల్ జీవిత చరిత్ర–వివిధ రంగాలలో ఆయన చేసిన సేవలు' అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. 20 మంది విద్యార్థిని, విద్యార్థులు వ్యాసాలు సమర్పించారు. సెమినార్ న్యాయ నిర్ణతలుగా అంజద్ షరీఫ్, సయ్యద్ జమీలుద్దీన్ వ్యవహరించారు. సమద్ మాట్లాడుతు విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా, కొత్త అంశాల అన్వేషణలో అంతర్జాతీయ ఉర్దూ కవి, ఉర్దూ సాహిత్య వేత్త అల్లమా ఇగ్బాల్ జీవితాన్ని తర్కిస్తు వ్యాసాలు వినిపించారన్నారు. కరీముల్లాహ్ మాట్లాడుతూ ఉర్దూ విద్యార్థులలో నైపుణ్యాన్ని పెంపొందించేందుకు ఉర్దూ సాహిత్య కమిటీ కార్వానె ఉర్దూ సభ్యులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కార్వానె ఉర్దూ జిల్లా కన్వీనర్ సి. అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ ఉర్దూ సెమినార్ లో పాల్గొన్న విద్యార్థులకు ఈ నెల 9న స్థానిక నేషనల్ పిజి కళాశాలలో ముఖ్య అతిథుల చేతుల మీదుగా మెమోంటో, ప్రశంసా పత్రాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకుల బృందం, ఇంటర్ మీడియట్ ఉర్దూ విద్యార్థులు పాల్గొన్నారు.

ఉర్దూ కవితలు వినిపిస్తున్న విద్యార్థి

ఆయాలకు పెండింగ్ వేతనాలు ఇవ్వాలి

ప్రజాశక్తి - నంద్యాల అర్బన్

ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ఆయాలకు నాలుగు నెలల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని ప్రభుత్వ పాఠశాలల ఆయాల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.శివ బాలకృష్ణ డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలో ఆయాల సంఘం సమావేశం మంగళవారం నంద్యాలలోని సిపిఐ కార్యాలయంలో పట్టణ కార్యదర్శి డి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. డి.శివ బాలకృష్ణ మాట్లాడుతూ ఆయా సమస్యలపై చర్చించి తగిన కార్యక్రమాలు రూపొందించుటకు ఈనెల 10న ఆయాల సంఘం రాష్ట్ర మహాసభ ఏలూరులో జరుగుతుందని, ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాగేంద్ర, కార్మికులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దార్

తూతూమంత్రంగా సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - గడివేముల

గడివేముల మండల పరిషత్ కార్యాలయం నందు మంగళవారం మండల సర్వసభ్య సమావేశం మండల అధ్యక్షురాలు నాగబద్దమ్మ ఆధ్వర్యంలో తూతూ మంత్రంగా సాగింది. ఈ సమావేశంలో ఎంపీడీవో వాసుదేవ గుప్తా, తహసిల్దార్ వెంకటరమణ మాట్లాడుతూ మండలంలోని అన్ని శాఖలకు చెందిన అధికారులు మండల సర్వసభ్య సమావేశంలో మండల ప్రజాప్రతినిధులు సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పిటిసి మండలంలోని గ్రామాల సమస్యలను మండల సర్వసభ్య సమావేశంలో తెలిపిన సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా గ్రామాలలో పా రిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. గ్రామాలలో నీళ్ల ట్యాంకులను శుభ్రపరచి బ్లీచింగ్ పౌడర్ చల్లాలన్నారు. గ్రామాలలో జరుగుతున్న ఉపాధి పనులపై ప్రజలకు ఉపయోగపడేలా పనులను చేయాలన్నారు. గ్రామా సచివాలయాలలో ఉద్యోగులందరూ ప్రజలకు అందుబాటులో ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి ఆర్బి చంద్రశేఖర్ రెడ్డి, సర్పంచ్ నాగేశ్వర్ రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు కాలు నాయక్, మండల ఉపాధ్యక్షురాలు హైమావతి, ఎంపీటీసీ మహేశ్వర్ రెడ్డి, అన్ని శాఖ చెందిన అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలో పాల్గొన్నారు.

అయ్యప్ప స్వాములకు అన్నదానం

ప్రజాశక్తి - బనగానపల్లె

పట్టణంలోని రవ్వలకొండపై విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో అయ్యప్పస్వాములకు అన్నదాన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ట్రస్ట్ చైర్మన్, గుండ్లసింగవరం సర్పంచ్ కాటసాని రమాకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో అయ్యప్పస్వాములకు అన్నదానం చేవారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు ఎస్టీ నాగరాజువర్మ, రాయల్ సుబ్బరాయుడు, ఎస్వీ చైతన్య వెంకటేశ్వర్లు, వెంకట్రామిరెడ్డి, రాజారెడ్డి, సందీప్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప భక్తులకు అన్నదానం చేస్తున్న కాటసాని రమాకాంత్ రెడ్డి

విల్లంబు, బాణాలు బహూకరణ

ప్రజాశక్తి - బనగానపల్లె

బనగానపల్లె పట్టణ శివారులోని రవ్వలకొండపై ఉన్న చెంచులక్ష్మి సమేత పావన నరసింహ స్వామి దేవస్థానానికి అహోబిలం నుండి ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ మల్లె వీర చంద్ర అమ్మవారికి విల్లంబు, బాణాలు మంగళవారం బహుకరించారు. అర్చకులు బాలిశెట్టి పావన నరసింహమూర్తికి విల్లంబులు బాణాలను అందజేశారు. అమ్మవారు చెంచు వారికి ఆడబిడ్డ కాబట్టి, సాంప్రదాయ ప్రకారంగా విలనంబు, బాణాలు సమర్పించుకున్నామని చంద్ర తెలిపారు. కార్యక్రమంలో అహోబిలం మురళి కుమార్, నంది పైపుల బెడదల రామచంద్రారెడ్డి, కనిగిరి ధనుంజయ రెడ్డి, యాగంటి పల్లె దస్తగిరి పాల్గొన్నారు.

చెంచులక్ష్మి పావని నరసింహస్వామి దేవస్థానానికి విల్లంబులు, బాణాలను అందజేస్తున్న దృశ్యం

ఉషూలో జిల్లా క్రీడాకారులకు పతకాలు

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

ఈనెల 3, 4 తేదీలలో శ్రీకాకుళంలో జరిగిన రాష్ట్రస్థాయి ఎస్‌జిఎఫ్ అండర్–19 ఉషూ పోటీలలోజిల్లా క్రీడాకారులు పతకాలు సాధించారు. ఉమ్మడి కర్నూలు జిల్లా ఎస్ జి ఎఫ్ అండర్ 19 కార్యదర్శి సి హర్షవర్ధన్ ఈ సందర్భంగా చిన్నారులు మంచి ప్రతిభ చూపించి మన జిల్లాకు 8 పతకాలు సాధించారని క్రీడకారులకు అభినందనలు తెలియజేశారు. ఎస్ జయకుమారి, జి.అశ్విత, హెచ్ శిరీష గోల్డ్ మెడల్, కె.శివలక్ష్మి, జి.మధు మేఘన, యు. పుష్పావతి, ఎస్ గౌరమ్మ, ఎస్ కీర్తన సిల్వర్ మెడల్ సాధించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉషూ సంఘం కార్యదర్శి టి శ్రీనివాసులు, మేనేజర్ జి. లక్ష్మి నరసమ్మ, కేజీబీవీ పిఇటిలు ఎం నాగ సులోచన, ఏ మాధవ లక్ష్మి, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

పంటల బీమాను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి సి బెళగల్

రబీ సీజన్లో ప్రతి రైతు పంటల బీమాను సద్వినియోగం చేసుకోవాలని ఏఓ మల్లేష్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోనీ పోలకల్ లో. పొలంపిలుస్తోంది కార్యక్రమం చేపట్టి పంటల బీమాపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పంటల బీమా రైతులకు ఉపయోగకరమని అన్నారు. పంటల బీమాను ప్రతిఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అన్నిరకాల పంటలను బీమా చేసుకోవాలని అనానరు. అనంతరం శనగ, వేరుశనగ పంటలను వ్యవసాయ సిబ్బంది అఫ్రిన్, వెంకటేశ్వర్లు, భాస్కర్,భరత్‌ల సమక్షంలో పరిశీలన చేపట్టారు.

శ్రీ రంగనాథ స్వామి దేవస్థానం హుండి లెక్కింపు

ప్రజాశక్తి-మద్దికెర

శ్రీ రంగనాథ స్వామి దేవస్థానం హుండీ లెక్కిస్తున్నట్లు ఆలయ నిర్వహణ అధికారి వీరయ్య తెలిపారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శాశ్వత హుండీలు తేదీ 5. 11 .2024వ తేదీ లెక్కించగా ఏడు నెలల 8 రోజుల కాలమునకు వచ్చిన ఆదాయం రూ పది లక్షల 62 వేల 160 వచ్చినట్లు తెలిపారు. ఆలయ పర్యవేక్షణాధికారి వెంకటేశ్వర్లు , ఆలయ ముఖ్య అర్చకులు కె.రంగస్వామి దేవస్థాన సిబ్బంది,గ్రామ ప్రజలు సేవా సమితి వారి ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు జరిగింది.

టిడిపి సభ్యత్వం కార్యకర్తకు భరోసా

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

టిడిపి సభ్యత్వం తీసుకోవడం ప్రతి కార్యకర్తకు భరోసాని ఇస్తుందని కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, టిడిపి రాష్ట్ర బిసి సెల్ అధికార ప్రతినిధి గంపల పరమేష్ అన్నారు. మంగళవారం టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని అవార్డులోని దండెగేరిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టిడిపి సభ్యత్వం తీసుకున్న ఏ సందర్భంలోనైనా కార్యకర్త ప్రమాదంలో మరణిస్తే రూ.5 లక్షలు ప్రమాద బీమా గా మృతుని కుటుంబానికి లభిస్తుందన్నారు. మట్టి ఖర్చుల కోసం మరో రూ. 10,000 పార్టీ నిధి నుండి అందజేస్తారన్నారు. పార్టీలో ఏదైనా పదవిని ఆశించినా సభ్యత్వమే ప్రధాన భూమిక పోషిస్తుందన్నారు. కార్యక్రమంలో టిడిపి కార్యకర్తలు లక్ష్మీనారాయణ, కస్తూరి వెంకటేశ్వర్లు, శ్రీకాంత్, కృష్ణ, ఐటిడిపి కార్యకర్తలు అఖిల్, మురళి, కిరణ్, రఫీక్, తదితరులు పాల్గొన్నారు.

నారా లోకేష్ సారూ..డయాలసిస్ సౌకర్యం కల్పించరూ

డయాలసిస్ బాధితుడు మంత్రివర్యులకు మొర

ప్రజాశక్తి సి బెళగల్

నారా లోకేష్ సారూ... సి బెళగల్ మండలంలోను ఎమ్మిగనూరు కేంద్రంలోను డయాలసిస్ సౌకర్యం కల్పించరూ... అంటూ ఎమ్మిగనూరు కు చెందిన మిరియా వెంకటేశ్వర్లు , సిబెళగల్ కు చెందిన సద్దాం బాషలు మీడియా ముందు మొర పెట్టుకొన్నారు. ఈ ప్రాంతాలలో సుమారు 150 వరకు డయాలసిస్ బాధితులు ఉన్నారని , దూర ప్రాంతాలకు, పట్టణాలకు వెళ్లి అక్కడ అధిక బాధితుల రాకతో వైద్యం కోసం పడరాని పాట్లు పడుతున్నట్లు వాపోయారు. వైద్యం ఖర్చులు, వ్యయప్రయాసాలు ఆరోగ్యాన్ని మరింత కుంగదిస్తున్నాయని సి.బెళగల్, ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రులలో సౌకర్యం కల్పించాలని కోరారు.

18న ఆశావర్కర్ల కలెక్టరేట్ ముందు ధర్నాను జయప్రదం చేయండి

ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ పిలుపు

ప్రజాశక్తి - కోడుమూరు

ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని గూడూరులో సిఐటియు ఆధ్వర్యంలో ఆశా వర్కర్లు మెడికల్ ఆఫీసర్ ప్రత్యూషకు వినతి పత్రం ఇచ్చారు. సిఐటియు డివిజన్ కార్యదర్శి జె.మోహన్, ఆశా వర్కర్స్ యూనియన్ మండల నాయకురాలు శేషమ్మ, మాధవిలు మాట్లాడుతూ..... 2024 ఫిబ్రవరి 9న ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రతినిధి వర్గంతో కుటుంబ సంక్షేమ శాఖ అధికారులు చర్చలు జరిగాయని, చర్చల్లో ఆశా వర్కర్లకు వేతనాలు పెంచుతామని, ఆశా వర్కర్లకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇస్తామని, వయస్సు పరిమితిని 60 నుండి 62 సంవత్సరాలకు పెంచుతామని, ప్రభుత్వం కుటుంబ సంక్షేమ అధికారులు హామీ ఇచ్చారన్నారు. 9 నెలలు కావస్తున్నా ఇచ్చిన హామీల జిఒలు విడుదల కాకపోవడంతో ఆశా వర్కర్లు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారన్నారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, చనిపోయిన వారికుటుంబానికి బీమా సౌకర్యం ,తదితరాలు ఇంకా అమలు చేయలేదన్నారు. ఆశ వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఈ యేడాది ఫిబ్రవరిలో జరిగిన ఒప్పందాల జీవోలను , సర్క్యులర్లను వెంటనే విడుదల చేయాలన్నారు. ఆశ వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 18న కర్నూలు కలెక్టరేట్ ముందు జరిగే ఆందోళన కార్యక్రమంలో ఆశ వర్కర్లందరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఆశా వర్కర్లు కళావతి, సావిత్రి, మునీరాభాను, వరలక్ష్మి, పద్మావతి, అమిదభాను, ఆదిలక్ష్మి, తదితర ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

సిఎం సహాయనిధి పేదలకు వరం

ఎమ్మెల్యే కెఇ శ్యాం కుమార్

ప్రజాశక్తి-పత్తికొండ: సీఎం సహాయ నిధి పేదలకు ఒక వరం లాంటిదని పత్తికొండ ఎమ్మెల్యే కెఇ. శ్యాం కుమార్ పేర్కొన్నారు. మంగళవారం పత్తికొండ టిడిపి కార్యాలయంలో సీఎం సహాయనిధికి అర్హులైన బాధితులకు ఎమ్మెల్యే చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యం పరంగా ఆపదలో ఉన్నవారికి సకాలంలో చికిత్స కోసం అందిస్తున్న నిధులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పార్టీలకు అతీతంగా కేవలం అర్హతే ఆధారంగా సీఎం రిలీఫ్ ఫండ్ నిధులు అందిస్తున్నారన్నారు. పత్తికొండ నియోజకవర్గం పరిధిలోని పదిమందికి రూ.తొమ్మిది లక్షల 88 వేలు అందజేశామన్నారు.. కష్ట కాలంలో తమకు ఆర్థిక సహాయం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ఎమ్మెల్యే కెఇ.శ్యాంకుమార్‌కు బాధితులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి బత్తిన లోకనాథ్ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారుల వివరాలు :

వి.ఓబులేసు పుచ్చకాయలమాడ రూ. 1,64,174, శ్రీనివాసులు బురుజుల రూ.1,45,460 , సి.సునీల్ కుమార్ ఏడవలి రూ.55,000, వై.ఎర్రమ్మ డోన్ రూ.1,04,005, సి అనసూయమ్మ పెండేకల్ గ్రామం రూ.59,350, కె శ్రీకాంత్ పుచ్చకాయలమాడ 1,00,527, జె సుంకమ్మ దూదేకొండ 20,273 , ఎం.రామ గోవిందు హంప రూ.1,01,299, ఎం.రఘు బాబు పత్తికొండ టౌన్ 37,853, విష్ణువర్ధన్ రెడ్డి బొల్లవానిపల్లి గ్రామం రూ.1,05,343


చెక్కులు అందజేసిన కెఇ.శ్యామ్‌కుమార్

వైసిపి ప్రభుత్వంలోనే అక్రమంగా బంకులు వేశారు

మహిళలను అడ్డం పెట్టుకొని రాజకీయాలు - టిడిపి కార్పొరేటర్లు, నాయకులు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూలు నగరంలోని సిక్యాంపులోని మున్సిపల్ స్కూల్ వద్ద అక్రమంగా బంకులు వేశారని 23వ వార్డు వైసిపి కార్పొరేటర్ కటారి పల్లవి, కటారి సురేష్‌తో పాటు ఆ పార్టీ నేతలు చేస్తున్న ఆరోపణలను తెలుగుదేశం పార్టీ నేతలు తీవ్రంగా ఖండించారు. మంగళవారం జిల్లా టిడిపి కార్యాలయంలో కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు మీడియా సమావేశంలో మాట్లాడారు. వైసిపి కార్పొరేటర్ వార్డులో ఎటువంటి అభివృద్ధి చేయలేదని, దీని నుండి ప్రజల దృష్టి మల్లించేందుకు తెలుగుదేశం పార్టీ నాయకులమైన తమను టార్గెట్ చేసి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. పైగా ఈ విషయంలో రాష్ట్ర మంత్రివర్యులు టిజి భరత్ పేరును వాడటం సబబు కాదన్నారు. రాష్ట్రాభివృద్ధితో పాటు కర్నూలు ప్రజలకు మంచి భవిష్యత్తు ఇచ్చేందుకు మంత్రి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. టిజి భరత్ ఎప్పుడూ అవినీతి, అక్రమాలను ప్రోత్సహించబోరన్నారు. ఎంబిఎ, డిగ్రీలు చదివిన నిరుద్యోగులు జీవనోపాధి కోసం బంకులు వేసుకుంటే ఓర్వలేక వైసిపి కార్పొరేటర్‌తో పాటు ఆ పార్టీ నాయకులు అనవసర రాద్ధాంతం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ బంకుల వల్ల పాఠశాలలో ఎవ్వరికీ ఇబ్బందులు లేవన్నారు. స్కూల్‌కు ప్రహారీగోడ ఉందని మహిళలకు దీని వల్ల సమస్యలే లేదన్నారు. టిడిపి నాయకులపై కక్షతో వైసిపి నేతలు నిజానిజాలు తెలుసుకోకుండా ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని చెప్పారు. ఇప్పుడు డబ్బులు తీసుకొని బంకులు వేశారని తమపై బురదజల్లితే చూస్తూ ఊరుకోమన్నారు. మహిళలను అడ్డం పెట్టుకొని రాజకీయాలు చేయడం సరికాదన్నారు. గతంలో శ్రీరాంనగర్ అభివృద్ధికి మాజీ మంత్రి టిజి వెంకటేష్ ఎంతో కృషి చేశారన్నారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు పరమేష్, క్రాంతికిషోర్, ఫరాజ్ ఖాన్, తెలుగు యువత పార్లమెంట్ అద్యక్షుడు అబ్బాస్, మాజీ కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు గున్నామార్క్, స్వామిరెడ్డి, సుంకన్న, ఖాదర్ బాషా, మోయిన్ బాషా, నవీన్, క్రిష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న టిడిపి నాయకులు

ముఖ్యమంత్రి కలిసిన సోమిశెట్టి వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును తెలుగుదేశంపార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు మంగళవారం సెక్రెటేరియేట్‌లోని సిఎం చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు.

72 గోకులం షెడ్లు మంజూరు

ప్రజాశక్తి-తుగ్గలి

తుగ్గలి మండలంలో ఆవులు గేదెలు గొర్రెలను పెంచుకుంటున్న వారికి 72 గోకుల షెడ్లు మంజూరు అయినట్లు ఎపిఒ హేమసుందర్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మండలంలో 72 గోకులం షెడ్లు మంజూరయ్యాయని వీటికి ప్రభుత్వం రూ.15 కోట్లు నిధులు మంజూరు చేసిందన్నారు. అందువల్ల గోకులం షెడ్లు మంజూరైన రబ్ధిదారులతో వారంలోగా గోకులం షెడ్లు నిర్మాణాలు పూర్తయ్యే విధంగా చూడాలని తెలిపారు. సంబంధిత టెక్నికల్ అసిస్టెంట్ గ్రామాలకు వెళ్లి గోకులం షెడ్డు లబ్ధిదారులతో కలిసి వాటి నిర్మాణ పనులు కోసం మార్కింగ్ ఇవ్వాలని తెలిపారు. ఫీల్డ్ అసిస్టెంట్లు గ్రామాల్లో ఉండి షెడ్లు నిర్మాణాలు పూర్తయ్యే విధంగా చూడాలని తెలిపారు. నిర్మాణ పనులు చేపట్టకపోతే రద్దు అవుతాయని లబ్ధిదారులకు తెలియజేయాలని తెలిపారు. అందువల్ల లబ్ధిదారులు సకాలంలో నిర్మాణాలు పూర్తి చేస్తే వెంటనే బిల్లులు చెల్లిస్తామని తెలిపారు.

వేతన బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి - కోడుమూరు రూరల్

తమ డిమాండ్లు పరిష్కరించాలని రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కర్నూలు జిల్లా కోడుమూరు మండల 104 సిబ్బంది విద్యాధికారిణి డాక్టర్. వసంతకు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ తమకు 3 నెలలుగా వేతనాలు ఇవ్వలేదని, కుటుంబాలను పోషించటం చాలా కష్టమవుతుందని వాపోయారు. 104 సేవలను ప్రభుత్వమే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వారా కేవలం రూ.50 వేల ఖర్చు తో నిర్వహించి ప్రజా ధనం వృథాకాకుండా చూడాలన్నారు. 2020 తరువాత విధుల్లో చేరిన డ్రైవర్ , డిఇఒకు జిఒ 7 ద్వారా వేతనాలు ఇవ్వాలని అరబిందో యాజమాన్యం అక్రమంగా వసూలు చేసిన పిఎఫ్ తిరిగి చెల్లించాలన్నారు. 74 మంది సీనియర్ డ్రైవర్లకు స్లాబ్ అమలు చెయ్యాలని, డిఎస్‌సి ద్వారా నియమితులయిన సీనియర్ డ్రైవర్లను కాంట్రాక్టులో పెట్టాలని, ఉద్యోగులకు ఇన్సూరెన్స్ చేయించాలని, ఉద్యోగులకు యాజమాన్యం నుండి రావలసిన ఇతర బకాయిలు చెల్లించే విధంగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుని ఉద్యోగులకు న్యాయం చెయ్యాలని తెలిపారు. 104 ఉద్యోగులు బీసన్నగౌడ్ , జ్యోతప్ప , ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.